# పరీక్ష

గంటలు గణగణమని ఒక్కసారి మ్రోగాయి. దీపాల వెలుగులో ఆ దివ్యమంగళాకారుడు వెలసి పోతున్నాడు. రకరకాల పువ్వుల సువాసన వుక్కిరిబిక్కిరి చేసింది. మనసులో ఆకాశపుటంచుల్ని అధిగమించి పైకి లేచిపోతూన్న భావాలు. మానవాతీతమైన ఆశక్తి వునికిని శంకించేందుకు ఆస్కారం లేని వాతావరణం. రెండు నిమిషాల వరకూ వంచినతల పైకెత్తలేదు. మూసినకళ్లు తెరవలేదు. ఏదో వూహాతీతమైన జ్యోతి వెలిగింది.

నీటి చుక్కలతో వళ్లు విరుచుకున్నట్టున్న ఆ రెండు పువ్వుల్ని కళ్లకద్దుకుని ఆవరణ దాటి బయటకొచ్చాను. సుందరి కంగారుగా నడిచిపోతోంది. ఆమెనడకనుబట్టి గుర్తుపట్టాను. ఎదురుగా వస్తున్న మనిషిని ఢీకోపోయిందికూడా- ఒకటి రెండుసార్లు చీర కాళ్లకడ్డం వచ్చి ఆమెను బోల్తా కొట్టించబోయింది. గడియారంవంక చూస్తే

ఆరుగంటలైంది. అయిదున్నరకే రవణ వచ్చి వుండాలి. చప్పట్లు చరిచి పిలవగానే సుందరి ఆగి వెనక్కితిరిగిచూసి ఏదో తప్పిదం చేసిన దానికి మల్లే నాలిక కొరుక్కుంది. ఒకవేళ ఆమె గుళ్లోనే నన్ను చూసివుండి కూడా పలకరించలేదేమో!

'సుందరీ! ఏవిటిది? ఎన్నడూ లేనిది ఇవాళిలా వచ్చావు? రవణ ఇంకా రాలేదా?' అనడిగాను.

'ఇంకా రాలేదు.. మీరింటికే వస్తున్నారు కదా! అక్కడంతా చెప్తాను'. ఆమెకంఠం భయాన్ని వదలలేక బాధపడుతూంది. రెండడుగులు తొందరగా ముందుకు వేసి ఛటుక్కున ఆగిపోయింది.

'చూడండి!... మీరు నాకో సాయం చెయ్యాలి. నేనిలా గుళ్లోకి వచ్చినట్లు ఆయన్తో మాత్రం చెప్పకండి. అసలా ప్రస్తావనే ఎత్తవద్దు... ప్రళయం లేస్తుంది.!

మలుపు తిరిగేవరకూ ఆమె ఎంత వేగంతో పోతున్నదీ నేను గమనించగలిగాను. సుందరి రవణనుచూసి ఎందుకు జడుసుకొంటోందో నాకు తెలుసు. ఆ కారణం తల్చుకుంటే ఆపుకోలేనినవ్వు వచ్చింది.

రవణఇల్లు చేరుకునే సరికి మరో పదినిముషాలు పట్టింది.

'ఎవరదీ?' అంటూ రామయ్యగారు కళ్లమీద అరచేయి వుంచుకొని నేనెవర్నో కనుక్కుందికి ప్రయత్నించారు.

'నేనండీ! ... సాంబమూర్తిని' అని వాక్యం పూర్తిచేయటం, సుందరి వెండిగ్లాసునిండా పొగలు కక్కుతూన్న కాఫీని నాముందర వుంచటం ఒక్కసారే జరిగాయి. నేననుకున్నది సరైనదే- రవణ ఇంకా ఇంటికి రాలేదు.

'అవున్నాయనా!... నువ్వెంత దగ్గరగా వున్నా కనపడటం లేదు. మనిషి ఏ అవయవం లేకపోయినా ఎలాగోలాగ బతుకు యీడ్చుకుపోగలడు కాని, చక్షువులు లేకపోతే జీవించలేడు. అవి లేనంతకాలం వెలుగూ- చీకటి- అనే విభేదం వుండదు' ఆ మాటలు శిథిలమయిన కట్టడంలోంచి వచ్చినట్టున్నాయి. ఏదో లోతైన ఆవేదన- తుఫానుకు చెట్లు భయంతో వూగిసలాడినట్టు.

"అలా ఎందుకనుకుంటారు? ఎలాగూ రేపు ఆపరేషన్ జరుగుతుందిగా! నెలరోజుల్లో మీ కళ్లకు యౌవనం వస్తుంది" అంటూ నవ్వటానికి ప్రయత్నించాను. ప్రతి చిన్నవిషయానికీ బాధపడుతూ అనుమానపడుతూ వుండే వ్యక్తులు సూర్యుడు తూర్పున వుదయిస్తాడన్న సత్యాన్ని కూడా నమ్మలేరు. రామయ్యగారిది నియమబద్ధమైన సనాతన జీవితం.

"బాబు ఏడీ!... కనపట్టం లేదు!" అనడిగాను.

సుందరి ముఖంలో విచార రేఖలు విస్తరించాయి.

"ఏం చెప్పనండి?... ఆ వేళటినుండి ఒకటే జ్వరం మధ్యమధ్య తగ్గుతుంది. మళ్లా వస్తుంది. అప్పుడప్పుడు వాంతులు- ఏవో పలవరింతలు- జడుసుకున్నాడని చెబితే ఆయన

వినిపించుకోరు, ఏం చేయను? ఖర్మ" అంటో నెత్తి బాదుకుంది.

'అసలు సంగతది కాదు నాయనా! బాబుకు రెండేళ్లున్నప్పుడు పెద్దగా జబ్బు చేసింది. జ్ఞాపకం వుందా? బతుకుతాడని ఎవరూ అనుకోలేదు. అప్పుడు మనవణ్ణి దక్కించమని తిరుపతి దేవుడికి మొక్కుకున్నాను. అప్పట్నుంచీ వీడిదగ్గర బుర్ర బ్రద్దలు కొట్టుకుంటున్నాను. అతను వినిపించుకోడు. తనకలాంటి నమ్మకాలు లేవంటాడు. వెంకటేశ్వరస్వామికి కోపం రాకుండా వుంటుందా?' అని వ్యాఖ్యానించింది రవణ తల్లి. 'ఇలాంటి నాస్తికుల మధ్య బతకలేం నాయనా!... మా తమ్ముడు నిన్ననే వుత్తరం రాశాడు. కళ్ళు బాగుపడ్డాక తనదగ్గరకు వచ్చి వుండమని-' అని విసుక్కున్నారు రామయ్యగారు.

మానవజీవితాలకు పునాది రుజువులేనినమ్మిక లేదేమోననిపిస్తుంది. ఒక అబద్ధాన్ని పదేపదే చెప్పటం వలన అదే నిజంగా మారుతుందని, దాన్ని ప్రజలు విశ్వసిస్తారని షేక్స్‌పియర్ ప్రతిపాదించాడు. దాని నిజానిజాలు ఎలావున్నా కొన్నిసూత్రాలుమాత్రం విమర్శకాస్కారం యివ్వకుండా మనలో పాతుకుపోయాయి. వాటిని ఖండించటం అంత సులభం కాదు. విజ్ఞానశాస్త్రం సరైన రుజువులేనిదే దీన్ని ఆమోదించదు. కాని వేదాంతం ఎలాంటి ఉపపత్తీ ఇవ్వకుండా శాసిస్తుంది. పాపంచేస్తే యమలోకానికి పోతావంటుంది. తనకు దాస్యంచేస్తే తలకుమించిన కోరికలు కోరినా నెరవేరుస్తానంటుంది'... జరగవలసినదంతా ముందే నిశ్చితమైనప్పుడు విజయంకోసం కనపడని దేవుణ్ని గురించి ఆలోచించటం వృధాగా కాలాన్ని పాడుచేయటం కాదా?' అని రవణలాంటి వారు ప్రశ్నిస్తే వాళ్లకు సరైన సమాధానం లభించదు సరికదా, ఎదురు గాలులు దావాగ్నిలా చుట్టివేస్తాయి. కన్నతల్లిదండ్రులు కూడా అతణ్ణి అసహ్యించుకోవడానికిదే మూలకారణం.

పక్కగదిలో బాబు నిద్రపోతున్నాడు. నుదుటిమీద చేయివుంచి చూచాడు. జ్వరం లేదు. మళ్లీ హాల్లోకి వెడదామని వెనక్కి తిరిగేవరకూ అతని మెడలోవున్న పసుప్పచ్చటి తాడు చూడలేదు. నా కళ్లల్లో వున్న ప్రశ్న అర్థంచేసుకున్న సుందరి చెప్పింది.

'ఆయనతో చెప్పారు కనక- తలతీసేస్తారు... ఈ వీధి చివర వున్న ఆచారిగారు మంత్రించి ఇచ్చారు. రేపు ఉదయానికల్లా బాబు కిలకిలమని నవ్వుతూ లేచి తిరుగుతాడన్నారు. ఏం చేయను మరి? ఈ సాయంత్రం గుళ్ళోకి వెళ్ళి మొక్కుబడి చెల్లించి వచ్చాను. ఆయన వచ్చేస్తారేమోనని కంగారుపడ్డాను- ఇంకా నయం!... దేవుడి దయ!'

ఒకవ్యక్తి తనకున్న అభిప్రాయాన్ని మరొకరి నెత్తిమీద రుద్దటం అన్యాయమనిపించింది. రవణతో పరిచయం కలిగాక ఈ నాలుగేళ్లలో అతనిలో చాలావిచిత్రాలు చూశాను. సుందరిని ఏ వ్రతమూ- పూజా- చేసుకోనివ్వడు. అంటే ఆమెమీద చేయిచేసుకోటంగాని, గదమాయించటం కాని జరగదు. మనసును చీల్చి వేసేటట్టు తమాషాగా కబుర్లు చెప్పి వాదించే సామర్థ్యం అతనికి వుంది. ఆనాటిదృశ్యం ఇంకా నాకు గుర్తుంది.

'ఇవేళ హరికథా కాలక్షేపం వుంది. అత్తయ్యా, నేనూ వెడుతున్నా.' అంది సుందరి.

'కథ ఏవిటి?... నేనూ వస్తాను' అన్నాడతను సీరియస్‌గా. సుందరి తెల్లమొహం వేసింది.

'రామాయణంలో యుద్ధకాండ' అంది. అసలు రామాయణం పేరు తన భర్త ఎప్పుడైనా విన్నాడా? అని ఆమె అనుమానపడినా నేను ఆశ్చర్యపడను.

కూర్చున్న వాడల్లా రవణ కుర్చీలోంచి అమాంతం లేచి చిన్నపిల్లాడిలా గంతులేస్తూ 'అప్పుడు శ్రీరాముడే మన్నాడంటే...' అంటూ మొదలెట్టి 'అది కాస్తా నేనే చెప్తాను. అలా కూర్చోండి' అన్నాడు. సుందరికి కోపం, ఏడుపూ కలిసి వచ్చాయి. తరతరాలుగా ఆమెలో పాతుకుపోయిన ఆస్తికభావాల్ని వేళ్లతోసహా పెళ్ళగించి గిరవాటు పెట్టడానికి ప్రయత్నించటం వృథా. ఇదంతా చూస్తున్న నాకు ఎవరిపక్షం వహించాలో తెలిసింది కాదు. సుందరి మనసు సున్నితమైంది. ఎన్ని మెలికలు తిప్పి డొంక తిరుగుడుగా చెప్పినా దాంట్లో వున్న 'కారం' ఆమె రక్తంలో కలిసిపోతుంది. మరోనాడు ముగ్గురం ఓ మిత్రుడి పెళ్లికి బయలుదేరాం. నేనే ముందుగా ఆ అనుమానాన్ని లేవదీశాను. 'ముగ్గురం కలిసి వెడితే ఆపని ముక్కలవుతుంది' అని. రవణ నాకేసి వింతగా చూసి 'మీరు కొన్ని శతాబ్దాలకు పూర్వం జన్మించి వుండవలసింది. అదే నిజమైతే దాన్ని పరీక్షించటానికి ఇదే అనువైన సమయం' అంటూ బయలుదేరాడు. అతని మాటకెదురు చెప్పలేకపోయాం. ఇంతలో పుండుమీద కారం జల్లినట్లు వెనకనుంచి ఎవరో తుమ్మడం- ఒంటి బ్రాహ్మడు ఎదురుగా రావటం జరిగాయి. రవణకు అనుకోకుండా నిధి దొరికినంత సంతోషం కలిగింది. నా గుండెలు మాత్రం అతివేగంతో కొట్టుకున్నాయి. అనాదినుంచీ ఎముకల్ని అంటిపెట్టుకుని వున్న నమ్మకాల్ని ఎలా విదిలించగలం?

పెళ్ళి సవ్యంగా జరిగిపోయింది. రవణ మమ్మల్ని వెక్కిరించాడు. సాయంత్రం మేడమెట్లు దిగుతూ కాలు జారిపడ్డాడు. ఎముకలు విరగవలసిందే కాని అదృష్టవశాత్తు అంతపనీ జరగలేదు. ఈ సంఘటనను ఆధారంగా తీసుకొని అతనిలో పరివర్తన తీసుకు రావడానికి యత్నించాను. పరాకుగా వుండటం వలన అలా జరిగిందేకాని, శకునాలకూ, దీనికీ ముడిపెట్టడం తెలివితక్కువన్నాడు. 'ఇదంతా ఆవేళ జడుసుకున్న దాని ఫలితం!' అంటూ సుందరి ఆలోచనా ప్రవాహానికి అడ్డం తగిలింది... అవునవును... ఆ సంఘటన ఎలా మరవగలను?... నాలుగైదు రోజులక్రితం ఆదివారం నాడు... తథాగతుడు చిరునవ్వు నవ్వాడు.

అస్పష్టంగా కనిపిస్తున్న వదనంలోంచి బయలుదేరుతూన్న విజ్ఞానకాంతుల్లో నేను మునిగిపోయాను. నాలో నేనే ఏదో గొణుక్కున్నాను. గుహ ప్రతిధ్వనించింది. తొమ్మిదడుగుల ఎత్తున్న బుద్ధుడు మళ్లీ చిరునవ్వులు విసిరాడు.

ఏదో మెత్తగా కాళ్లకు చుట్టుకున్న అనుభూతి. ఊహా ప్రపంచంలో కొన్ని సంవత్సరాల క్రితం వున్న వైభవంలో దైవత్వాన్ని మిళితం చేసుకుని విహరిస్తున్న మనసు ఒక్కసారిగా ఈ లోకంలోకి పరుగులు తీస్తూ వచ్చింది.

అసలే కొండ ప్రదేశం- "ఏ కొండచిలవో- పామో కాలికి చుట్టుకుని వుంటే?"... భయంతో తల దించి చూసి ఆశ్చర్యపోయాను.

'మావయ్యా!.. మావయ్యా!' అంటూ గంతులేస్తూ నవ్వాడు బాబు. అతని బుగ్గలు

గుంటపడి అమాయకత్వంతో నిండిపోయాయి. నెత్తికి చుట్టివున్న ఎఱ్ఱరుమాలు అటూ యిటూ, గాలిక రెపరెపలాడింది.

బాబూ!.. ఇలా ఇక్కడికి వచ్చావు?... ఎవరు తీసుకొచ్చారు?' అంటూ గభాలున ఎత్తుకున్నాను.

నా వెనకాల కంగారుగా రవణ- సుందరి పరిగెత్తుకు రావటం చూశాక అంతా అర్థమైంది.

'హారి పిడుగా!... మమ్మల్ని వెర్రివెంగళ్ళాయుల్నిచేసి బాగా ఆడిస్తున్నావురా!... మీరు వచ్చినట్టు నాకు తెలియదు. సుందరి చేతి వుంగరం ఎక్కడో పడిపోయింది. అది వదులుగా వుంటే పెట్టుకోవద్దన్నాను. వినలేదు. ఆమెకు ఏ దూర్వాసుడూ శాపంయివ్వలేదు కనుక ఇప్పుడు వచ్చిన ప్రమాదమేవీ లేదు... ఆ రాతిమీద బాబును కూర్చోబెట్టి వెదుకుదామని వెళ్లాం. ఈలోగా వాడు పరిశోధకుడిగా బయలుదేరాడు' అన్నాడురవణ. నవ్వకపోతే కొరడా దెబ్బలు తగులుతాయన్నట్టు సుందరి నవ్వింది. రవణ ముఖంలో నిరాశారేఖలు కదిలాయి.

'కానరీస్ గుహలంటే ఏవిటో అనుకున్నాను. ఇందుకేనా బొంబాయినుండి ఇరవై మైళ్లు ప్రయాణం చేసి వచ్చాను? అంతా నేతిబీర కాయలాంటిది. హక్స్లీ అన్నట్టు మనం చూడని ప్రదేశంలో ఏదో వింత వుందని అనుకోవటమే కాని, అది సత్యదూరమన్న మాట నిజం.'

మేం నడుస్తూ కొండ సగం యెక్కాం.

'అయితే రవణా! ఈ గుహలు నీలో ఆధ్యాత్మిక చింతల్ని లేవదీయటం లేదూ?... పోనీ నీకు దానిమీద నమ్మకంలేదు కనుక వదిలేద్దాం. చరిత్రాత్మకంగా- కళారూపంలో నీకెలాంటి ఉత్సుకతా కలగటం లేదూ? సుమారు వెయ్యి సంవత్సరాల క్రితం ఈ గుహల్లోనివసించిన బౌద్ధబిక్షువుల జీవిత క్రమం, ఆచార వ్యవహారాలు, వీటిని గురించి ఆలోచించాలనిపించటం లేదూ?'

'లేకేం?... తెలుస్తూనే వుంది. కాయకష్టం లేకుండా; బుద్ధుడు పేరు చెప్పుకొని హాయిగా, గౌరవంగా బతికారు. ఇందులో మెచ్చుకోతగ్గదేమీ లేదు'

అతనితో వాదించి లాభం లేదని ముందే చెప్పాను.

రెండు ఎత్తైన కొండల మధ్య పెద్దలోయ- వానా కాలంలో ఆ లోయ నీటితో నిండి వుంటుందని వినికిడి. అవతల కొండమీద కొన్నిగుహలు కనిపించాయి. కాని అక్కడకు వెళ్లే మార్గంమాత్రం కనపడలేదు. రవణ ఆదృశ్యం ఫోటో తీయటానికి కెమెరా సరిచేస్తున్నాడు. సుందరి లోయకేసి తదేక దీక్షగా చూస్తోంది. నేను ట్రైపాయిడ్ సరిచేస్తున్నాను.

సుందరి ఒక్కసారిగా కెవ్వుమంది.

బాబు కనబడలేదు. ప్రకృతి సౌందర్యాన్ని చూస్తూ మమ్మల్ని మేం మర్చిపోయి అతన్ని గురించి ఆలోచించనేలేదు. అసలే అల్లరిపిడుగు. అందులోనూ కొత్తచోటు. రవణ కంగారుగా నాలుగు వైపులా చూశాడు. 'అమ్మోయ్' అని అరుస్తూ బాబు గుహలోంచి

పరుగెత్తుకొచ్చాడు.

ఆ గుహలోపల ఎడంపక్కనే చిన్న గదిలావుంది. అక్కడంతా చీకటితో నిండివుంది. ఒంటరిగా వస్తే ఎంతటి గుండెనిబ్బరంవున్న వాళ్లైనా జడుసుకుంటారు. అయినా అతనా చీకట్లోకి ఏముందని వెళ్లాడు? కళ్లు బెదురుతున్నాయి. ముఖంనిండా చెమటబొట్లు. మళ్లీ గట్టిగా అరిచాడు.

'ఏవిట్రా? .. ఏవయింది? అసలక్కడి కెందుకెళ్లావు?' అని గదమాయించాడు రవణ. బాబు సమాధానం చెప్పక వెర్రిగా చూశాడు.

'జడుసుకున్నట్టున్నాడు. రాక్షసుడికిమల్లే మీరు అరవకండి. ఇంక దిగిపోదాం- పదండి- చాలు' అని సుందరి సమాధానంకోసం ఎదురుచూడకుండా గబగబా దిగిపోయింది. చేసేదిలేక మేంకూడా వెంబడించాం... అది!... అప్పుడు జడుసుకున్నాడు- అందుకే యీ జ్వరం.

నా ఆలోచనలు ఒకచోటికి వెళ్లి ఆగిపోవటం రవణ నన్ను నవ్వుతూ పలకరించటం ఒక్కసారే జరిగాయి. హఠాత్తుగా ఆఫీసులో ఇన్‌స్పెక్షన్ వచ్చిపడిందని, భోంచేసి మళ్లీ వెళ్లవలసి వుంటుందని చెప్పాడు. ఆఫీసు దుస్తులైనా విప్పకుండా తిన్నగా బాబుపరున్న మంచం దగ్గరకు వచ్చాడు. అమాయకంగా నవ్వుతూ నిద్రపోవటం అతనికాశ్చర్యాన్ని కలిగించింది. మెడవరకూ దుప్పటి కప్పివుండటం వలన మెడలోని త్రాడు అతనికి కనిపించే అవకాశం లేదు. సుందరి తెలివైంది కనుక ముందుజాగ్రత్తపడింది. వ్యక్తిగతాభిప్రాయం ఎలా వున్నా ఈ ప్రత్యక్షనిదర్శనాన్ని ఖండించ లేకపోయాను. రవణ బాబు నుదుటిమీద చెయ్యి వుంచి చూశాడు.

'అరే!... జ్వరం నార్మలుకు వచ్చినట్టుందే! చిత్రం!... డాక్టరు మూడు రోజుల వరకూ టెంపరేచర్ వాచ్ చేయమన్నాడే... సుందరీ! వొడ్డించు! ఇదుగో వస్తున్నా' అంటూ కదిలిపోయాడు.

సుందరి విడిచిన దీర్ఘమైన నిట్టూర్పులోవుండే అర్థం నా ఒక్కడికే తెలుసు. పెదవుల మధ్యనుంచి నీటి బుడగలా పేలటానికి సిద్ధంగా వున్న నవ్వును బలవంతంగా అణుచుకుని వంటింట్లోకి వెళ్లింది.

నాటకరంగంమీద ఓపాత్ర ఎడంపక్కనుంచి వెళ్లిపోగానే కుడిపక్కనుంచి మరోపాత్ర ప్రవేశించినట్లు రవణ చేతిలో ధర్మామీటరుతో ప్రత్యక్షమయాడు. ఇంకోనిమిషంలో బాంబు పేలుతుందనుకున్నాను. టెంపరేచర్ చూసే ప్రయత్నంలో ఆ 'మంత్ర రజ్జువు'ను కనుక్కున్నాడు.

'సుందరీ!' అని పిలిచాడు.

పాత్రలన్నీ మళ్లీ రంగం మీదికి చేరుకున్నాయి.

'చూడండి!... మీకు కోటినమస్కారాలు. నన్ను మీరేమన్నా చేసినా, ఫర్వాలేదు. కాని బాబును మాత్రం దక్కనీయండి. మీకు తోచదు. ఒకరు చెబితే అర్థంకాదు. చిన్నపిల్లలు

జడుసుకోవటం సహజం- అందుకు ఏ డాక్టరూ ఇంతవరకూ మందు కనిపెట్టలేదు. వైద్యం చేయలేదు'

సుందరి దీనంగా చెప్పకుపోయింది.

రవణ ఫక్కున నవ్వేసి ఆతాడుకాస్తా పుటుక్కున తెంపేశాడు.

'వట్టి వెర్రిపిల్ల మా సుందరి' అంటూ రాగయుక్తంగా పలికాడు. ఈ సందడిలో బాబు మేల్కొని గట్టిగా ఏడవటం మొదలుపెట్టాడు. అతనిదృష్టిలో ఇలాంటి నమ్మకాలకు ప్రాధాన్యం లేదు.

'ఇది బొత్తిగా అనాగరికత- దేన్నైనా పరీక్షించకుండా నిశ్చయించటం బుద్ధిమంతుడి లక్షణం కాదు' అన్నాను.

'అంతే ననుకోండి! భూమి గుండ్రంగా వుంది. కనక అనాగరికతలో పుట్టి, నాగరికతతో బతికి తిరిగి అక్కడికే చేరుకుంటాం. అది సరేకాని రేపు రెండుగంటలకు ఆపరేషన్. ముందుగానే వచ్చేయండి' అంటూ టెంపరేచర్ చూసి వంటింట్లోకి నడిచాడు.

రామయ్యగారికి అరవైయేళ్లు దాటాయి. కంటిపాపలమధ్యవున్న చుక్క క్రమంగా తెల్లబడి అక్కడ శూన్యం ఏర్పడుతుంది. అప్పుడు కళ్లు కనిపించటం మానేస్తాయి. దీన్ని "కేట్రాక్స్" అంటారు. దీనికి ఆధునిక విజ్ఞానంలో చికిత్స వుంది. ఆపరేషన్ ద్వారా దృష్టిని తిరిగి రప్పించవచ్చు. రామయ్యగారు ఆపరేషన్‌కు ముందు ఓ చిన్న సంతర్పణ జరిపించాలని, సహస్రనామార్చనలు జరిపించాలని కోరుకున్నారు. కాని రవణ వినిపించుకోక అశ్రద్ధ చేశాడు. అందుచేత ఆయనకేమాత్రం శాంతి లేదు.

మర్నాడు అంతా సవ్యంగానే జరిగింది. సర్జన్ నామిత్రుడు. అతన్ని పిలిచి అడిగాను. అతను పెదవి విరుపులో ఆశారేఖల్ని మేళవింపజేస్తూ, యాభైవంతులు విజయం- డయాబెటిస్ పేషంట్ల విషయంలో ఎలాంటి ఫలితమూ చెప్పలేం- అది వారివారి అదృష్టం మీద ఆధారపడి వుంటుంది, అన్నాడు. నవనాడులు కృంగిపోయాయి. అంటే కాస్తోకూస్తో సాయపడిన కళ్లు అంధకారంలో యిరుక్కుపోతాయన్నమాట! ఈ విషయం తెలిస్తే రామయ్యగారు ఇదంతా దైవశాపమని కొడుకును దుమ్మెత్తిపోస్తారు. సముద్రంలో హఠాత్తుగా తుఫాను జనించినట్టు ఈ సంఘటనతో ఆ కుటుంబంలో కలహాలు జనిస్తాయి. హాలాహలంలోంచి అమృతం లభ్యమైనట్లు దీనివలన రవణ మారితే బాగానే వుండును. ఈ విషయం ఆ సాయంత్రం రవణతో ప్రస్తావించాను.

'అంటే వాళ్లు షుగర్‌టెస్ట్ సరిగ్గా చేయలేదన్న మాట. అలా అనుమానంగా వుంటే బాగుపడే వరకూ యింజక్షన్లు ఇవ్వవలసింది. ఇదేకనక ఫెల్యూర్ అయితే దావావేసి సర్జన్ అంతు కనుక్కుంటాను' అంటూ పళ్లు పటపట కొరికాడు. పోనీ దేవుడికి కొంత లంచం పారేస్తే ఏం పోయింది?

రవణ ఆరాత్రి పన్నెండుదాకా ఇంటికి రాడన్న సంగతి చెప్పటానికి వెళ్లాను. సుందరి భూగోళాన్నంతా మోస్తున్నట్టు కనిపించింది.

'చూడండన్నయ్యగారూ!... బాబుకు మళ్లీ జ్వరం వచ్చింది. నిద్రలో పిచ్చిగా పలవరింతలు ఎవరో పీక నొక్కేస్తున్నారట! కళ్లు తెరిచినప్పుడల్లా గుడ్లుమిటకరించి నాలుగు వైపులా చూస్తున్నాడు. ఇప్పటికి వారం రోజులుగా అతని పరిస్థితి అటూ ఇటూ కాకుండా ఉంది. ఆయనకంతా వేళాకోళంగా వుంది. ఏం చేయమంటారు చెప్పండి?'

'అయితే సుందరీ!... ఆ తాడు కట్టటం వలన ఏదైనా ఫలితం కనిపించిందా?'

'అయ్యో! ఆ తాడుకట్టిన అయిదు గంటలకల్లా జ్వరం తిరుగుముఖం పట్టింది. ముఖంలో నవ్వు వచ్చింది'

'అయితే మరో త్రాడు మంత్రించి తీసుకు వస్తే సరిపోతుంది'

'ఎలా? ఆయన తెంపిపారేస్తారుకదా?'

'రవణ వున్నప్పుడు తీసిదాచేయ్- దానికిదే విరుగుడు!'

'అలా పనికిరాదు. కనీసం మూడురోజులు మెడలో వుండాలని ఆచారిగారన్నారు. ఇష్టం వచ్చినట్టు తీస్తే దాంట్లో మనకు విశ్వాసం లేదని రుజువుచేయటమన్నమాట. డాక్టరు వచ్చి చూశాడు. ఉదయం ఇంజక్షనిచ్చాడు. మూడేళ్ల కుర్రాడి శరీరంలో సూది గుచ్చుతుంటే చూస్తూ నిలబడ్డారీయన- నిజం చెబుతాను. ఇలా అడుగడుక్కీ ఈయనతో జగడం పెట్టుకుని కాపరం చేయటమెలా?'

సుందరి కళ్లు నీటితో నిండిపోయాయి. తనకెలాంటి సలహా ఇవ్వలేకపోయాను.

భార్యాభర్తల మధ్య తెగతెంపులు కావటానికి పెద్ద పెద్ద కారణాలు అవసరంలేదు. మనస్తత్వశాస్త్ర దృష్ట్యా దీని పరిమాణమూ నిర్ణయించలేం- నాకు తెలిసిన ఓ మిత్రుడు వున్నట్టుండి కర్ణాటక సంగీతం నేర్చుకోటం మొదలుపెట్టాడు. ఇంటిదగ్గర ఒక్కగంట మాత్రమే సాధకం చేసేవాడు. వినయ విధేయతలతో మెలగిన సతీమణి ఓపికతో వుండలేక అతన్ని విదల్చివేసింది. అలాగే వీళ్లిద్దరి మధ్యా ఏదైనా అవాంతరం వుద్భవిస్తుందేమోనని భయపడ్డాను. కాని రవణ సుందరిని ప్రాణం కంటె ఎక్కువగా ప్రేమిస్తున్నాడని నాకు తెలుసు. ఆమెకోసం అతను చేయవలసిన త్యాగం అంటూ ఏదైనా వుంటే అది వూహకందనిదై ఉంటుంది.

ఏదైనా చుట్టూ కారుమబ్బులు కమ్ముకుంటున్నాయి.

తరువాత వారంరోజులు సందిగ్ధావస్థలో జరిగిపోయాయి. డాక్టరు మొదట్లో 'న్యుమోనియా' అన్నాడు. తరువాత టైఫాయిడ్ అన్నాడు. కోర్టుకు పోయే దోవలో వుంది కనక హాస్పిటల్‌కు వెళ్లి రామయ్యగారిని చూసి వస్తున్నాను. తరువాత రెండు రోజులకు రామయ్యగారిని డిశ్చార్జ్ చేశారు. కాని కంటికున్న కట్టు మరో వారంరోజులవరకూ విప్పకూడదన్నారు. రవణతల్లి వెంకటేశ్వర స్వామిముందుచేసిన తప్పుకు చెంపలు వాయించుకుని బాబును దక్కించుకోమని కొడుకుతో పోరుపెట్టేది. ఆమెకు రెండు మూడు సార్లు దేవుడు కలలో కనిపించి, మాట నిలుపుకోకపోతే పగ తీర్చుకుంటానన్నారట!

ఆవేళ ఓపెద్ద కేసులో వాదించి ఓడిపోయాను. కొండంత నిరాశతో ఇంటికి తిరిగి వచ్చి

ఆ కేసు తాలూకు వివరాలన్నీ నెమరువేస్తూ నా వాదనలో బలహీనత ఎక్కడ వుందని ఆలోచిస్తుంటే రవణ ఫోన్‌లో పిలిచాడు.

'తాటిపండు తల్లిచెట్టుతో సంబంధం వదలుకోవటానికి సిద్ధంగా వుంటే కాకి వాలిందిట- ఆ నింద కాస్తా పాపం, ఆ నోరులేని దానిమీద వేశారు. అలాగే నాకూ జరిగింది. కాని నేను జడుసుకోటానికి పిరికిపందను కాను. ఇదో సవాలైతే దాన్ని ఒప్పుకుంటున్నాను.'

ఈ వుపోద్ఘాతం భయాన్ని కలిగించింది.

'బాబు మధ్యాహ్నం పన్నెండుగంటలకు మమ్మల్ని వదిలి వెళ్లిపోయాడు. వెంటనే రావాలి.'

అరగంటలో చెమటలు కక్కుకుంటూ ఇంట్లో వాలాను.

ఎవరో కిలకిల నవ్వుతూ 'మావయ్య!... మావయ్య!' అంటున్నట్లనిపించింది. దయామయుడైన బుద్ధుడు ప్రసాదించే వరాలు ఇలాంటివేనా?... కళ్లు చెమ్మగిల్లాయి.

దీపం ఆరిపోగా మిగిలిన శరీరం అక్కడ ఉంది.

సుందరి నన్ను చూడగానే ఇంకా గట్టిగా గుండెలు బాదుకుని ఏడవసాగింది.

'మా బాబును చేతులారా చంపారు... నా మాట విన్నారు కారు'

అంతకంటే ఎక్కువగా తిరుగుబాటు చేసే శక్తి ఆమెకు లేదు.

'మనప్రాప్తం అంతే- ఏ చేస్తాం? రాసివున్నది జరక్క మానుతుందా?' అంటూ ఓదార్చటానికి యత్నించాను. రామయ్యగారు కదలికలేని శిలలా కూర్చుని వున్నారు. ఆయన ముఖంలో ప్రతి ముడతలోనూ కొన్ని లక్షల బాధలు ములుకుల్లా గుచ్చుకుంటూ పాముల్లా మెలితిరిగి పోతున్నాయి. చెప్పి చూశారు. శాయశక్తులా ప్రయత్నించారు. ఫలితం లేకపోయింది. కన్నులేని బాధ ఒకవంక- ఇది రెండో వంక.

రవణ మాత్రం గంభీరంగా వున్నాడు.

'డాక్టర్ లాడ్‌ని పిలవవలసింది. పొరపాటైంది, అతను సరిగా డయాగ్నైస్ చేసి వుండే వాడు'.

ఆ దుఃఖం సుందరిలో ఉపశమించదు.

రెండు రోజులు గడిచాక నన్ను కోర్టులో కలుసుకున్నాడు.

'సుందరి ఏమీ సుఖం పొందటం లేదు. పుండుమీద కారం జల్లినట్లుగా బాబును చంపింది నేనేనని సాధిస్తోంది. మా యిద్దరి అభిప్రాయాల మధ్య ఎంత మాత్రం సామరస్యం కాని, పోలిక కాని లేదు. రేపు పుట్టింటికి వెళ్లటానికి అన్ని ఏర్పాట్లూ చేసుకుంది. ఆమెను వారించటానికి నేను ప్రయత్నించలేదు. శత్రువులు ఎంతకాలం చెలిమిగా ఉన్నట్లు నటించగలరు?

పచ్చటి సంసారాన్ని ధ్వంసం చేసుకోటం సులువుగానే జరుగుతుంది.

రవణకున్న నాస్తికభావాన్ని తొలగించాలన్నది నా అభిప్రాయం కాదు. స్థిరమైన అభిప్రాయాన్ని మార్చటమంటే కొండలను చిటికెన వేళ్లమీద ఆడించటము లాంటిది. రవణ దేవుణ్ణి నమ్మనందుకు నాకెలాంటి బాధాలేదు. ఎందుచేతనంటే నేనూ దేవుణ్ణి చూడలేదు. కానతని మూలంగా ఇతరులందరికీ ఎన్నోరకాల బాధలు కలుగుతున్నాయి. ఇతరులకు హాని కలగనప్పుడు వారిని సంతోష పెట్టటానికి మనకిష్టం లేకపోయినా ఓ సిద్ధాంతాన్ని ఆచరిస్తున్నట్లు నటించటంలో తప్పులేదు. శూన్యాన్ని చూపిస్తూ అక్కడేదో విచిత్రమైన వస్తువుందని ఎవరైనా వాదిస్తే ఆవాదాన్ని ధిక్కరించి, విమర్శించి నోరెండించుకోటం అనవసరం.

పదిరోజులు గడిచాయి.

ఆరోగ్యం సరిగ్గా వుండకపోవటం వలన రవణఇంటికి వెళ్లటం వీలుపడలేదు. అందుచేత అక్కడి వాతావరణం ఏవిధంగా తయారైందీ నాకు తెలీదు. ఓనాడు సాయంత్రం కిటికీ దగ్గరగా పడక్కుర్చీలో పడుకుని వీధికేసిచూస్తున్నాను. పసుప్పచ్చ టాక్సీ రోడ్డువారగా ఆగింది. చెయ్యిపట్టుకొని రామయ్య గారిని రవణ నడిపించి తీసుకు వస్తున్నాడు. నాకేం అర్థంకాలేదు. రామయ్యగారిని మంచంమీద కూర్చోబెట్టాం. నేనేమీ అడక్కుండానే రవణ మొదలుపెట్టాడు.

'నాన్నగారు నాదగ్గర వుండటానికిష్టపడటం లేదు. చిన్నాన్నగారి వూరెడుతున్నారు. మిమ్మల్ని చూడాలంటే తీసుకువచ్చాను'

'చూడు నాయనా!... చిన్నప్పట్నుంచీ కట్టుదిట్టంతో, దైవభక్తిలో పెరిగాను. ఈ ముసలితనంలో నాస్తికుల మధ్య ఎలా వుండగలను? ఆపరేషన్ చేశాక వున్నకన్నుకూడా పోయింది'

'మూర్తిగారూ! నేనిదివరకే చెప్పాను. తప్పంతా ఆ సర్జన్‌దే- దావా వేయటానికి ఏదైనా ఆస్కారం వుందేమో చూడండి- నేను సిద్ధంగా వున్నాను-

'నువ్వు వృధాగాశ్రమపడకు... నేను చేసుకున్న పుణ్యం అంతే- దేవుడికి నా మీద దయతప్పింది.'

'అలాగనకండి!... కాలం ఒకేరీతిగా వుండదు- ఈ పరిస్థితుల్లో మీరు కన్నకొడుకుకి దూరంగా వెళ్లిపోవటం మంచిది కాదు.'

రామయ్యగారు నవ్వారు.

'నేను ముందే చెప్పాను. ఇది రెండురకాల సిద్ధాంతాల మధ్యవున్న పోరాటం. నాకిది కుదరదు. వేరుగా వుండటం మంచిది'

రవణంటే నాక్కూడా అసహ్యం వేసింది. కట్టుకున్న పెళ్లాన్ని పంపేశాడు. తండ్రిని తరిమేశాడు. అతను సాధించినదేమిటి? తరువాత సంభాషణ ఎంతోసేపు సాగలేదు- ఇద్దరూ తిరిగి వెళ్లిపోయారు.

నేటి విజ్ఞానం దైవాన్ని గురించి ప్రస్తావించదు. సిద్ధాంతాలను అల్లుకుంటూపోయి

చివరకు అనంతంలో అస్తమిస్తుంది. నిప్పులేనిదే పొగకనిపించదన్నట్టు, దేవుడనేవాడే లేకపోతే ఈ చరిత్ర ఎలా పుట్టింది? కారణరహితంగా ఏదీ జనించదు. తరతరాలుగా వొస్తున్న నమ్మకాల్ని కాలదన్ని, మనకున్న స్వల్పతార్కిక జ్ఞానంతో అనంతమైన వెలుగులో ఓ కిరణం తాలూకు అణువును మాత్రం చూడకలిగి నేను సర్వస్వం తెలుసుకున్నానని గుండెమీద చేయి వేసుకొని చెప్పటం సులభం కావచ్చు. కాని అందుమూలంగా ఏర్పడే చిక్కులు అనంతం. అవన్నీ నిస్సహాయతతో వున్న మృగాన్ని కొండచిలువలా చుట్టేసి హతమారుస్తాయి.

*** *** ***

నాలుగు మాసాలు గడిచాక ఓనాడు రవణ ఇంటికి వెళ్లాను. బాబుపోయాక, అప్పుడప్పుడు కలుసుకుని యోగక్షేమాలు విచారించటమే కాని, ఇంటికి వెళ్లటం ఇదే మొదటిసారి. హాల్లో ఎవరో అమ్మాయితో పకపక నవ్వుతూ కబుర్లు చెబుతున్న వాడల్లా నన్నుచూసి కొంచెం కంగారుపడ్డాడు. ఆ అమ్మాయికూడా వినయంగా లేచి నిలబడింది. నాకిదేం అర్థంకాలేదు. కట్టుకున్న పెళ్లాన్ని వద్దుపొమ్మని ఏవిటీపగటి వేషాలనిపించింది. అయినా, నిజానిజాలు తెలుసుకోకుండా తొందరపడకూడదని నిర్ణయించుకున్నాను. కుర్చీలో కూర్చోబెట్టాడు. 'నామీద/శీతకన్ను వేశారు. నేను మీకు చేసిన ద్రోహమేమిటి?' అనడిగాడు.

'అబ్బే! అలాంటిదేవీ లేదు. తీరుబడిలేక...' అని నేనింకా వాక్యం పూర్తిచేయకుండానే 'అవునవును... తలకుమించిన పనులు... సరే కానీయండి ఇంక పరిచయాలు చేస్తాను. ఈ లలన నా ద్వితీయ కళత్రం. పేరు సుజాత. వివాహం గప్‌చిప్‌గా జరిగినందుకు క్షమించండి. ఈయన ఆస్తిక సామ్రాట్ సాంబమూర్తిగారు- ఫేమిలీ ఫ్రెండ్' అనగానే ఆ అమ్మాయి నమస్కరించింది. శరీరంలో ప్రతి రక్తపు చుక్క కోపంతో పొంగిపోయింది. ఆ అమ్మాయి వయ్యారంగా లోపలకు నడిచివెళ్లి పళ్లెంలో మైసూరు పాకాలు, గ్లాసునిండా పాలూ తీసుకొచ్చి నాముందర వుంచింది.

'ఛీ?... నిన్ను మనిషికింద జమకట్టటం నా పొరపాటు. నిష్కారణంగా సుందరి జీవితం నాశనం చేసినందుకు బాధలేదు. సిగ్గులేదు. మరో అమ్మాయిని పెళ్లిచేసుకున్నాడట, ఎవరెస్టు శిఖరం ఎక్కినట్టు గొప్పగా చెబుతున్నాడు... ఇదుగో రవణా! ఈనాటి నుండి నీకూ, నాకూ సంబంధం నాస్తి' అంటూ అరిచాను.

'ఎవరూ?... అన్నయ్యగారా? గది కప్పుకాస్తా పైకెగిరిపోగలదు. ఏవిటంత గట్టిగా అరుస్తున్నారు?' అంటూ సుందరి ప్రత్యక్షమైంది.

"నా కళ్లను నమ్మమంటారా? వద్దా" అనడిగాను.

"తప్పదయ్యా! ఎదురుగా కనిపిస్తుంటే ఎలా కాదనగలం?... చూడుమరి. ఇప్పుడే స్నానం చేసి వచ్చినట్టుంది. జుట్టు తడిగా వుంది." అన్నాడు.

"ఏవిటిదంతా?" అనడిగాను.

'మీ కోపాగ్నిని రగిల్చినందుకు క్షమించండి... సుజాత సుందరికి స్వయానా చెల్లెలు. సుందరి వచ్చి రెండు రోజులైంది మిమ్మల్ని రమ్మన్నది ఇందుకే...'

'ఆలుమగల కయ్యాలు అద్దంమీది అవగింజ' అన్న పాతసామెతను జ్ఞప్తికి తెచ్చుకున్నాను.

తరువాత రవణ జరిగినదంతా వివరంగా చెప్పుకుపోయాడు. నేను ముందే చెప్పాను. అతను సుందరిని విడిచి బతకలేడని. మామగారింటికి వెళ్లి సుందరిని వచ్చేయమని సామ దాన బేధ దండోపాయాలు ప్రయోగించి బతిమాలి విజయం సంపాదించాడట.

'రేపే అమ్మా, నాన్నా వస్తున్నారు. వారం రోజుల క్రితం చిన్నాన్నగారి వూరు వెళ్లాను. ఇద్దర్నీ వొప్పించేసరికి తలప్రాణం తోకకు వచ్చింది. నేను నాస్తికుడనయితే దేవుడు నన్ను దండిస్తాడు కాని అమాయకులైన వార్నెందుకు దండిస్తాడని నచ్చజెప్పాను. మరో సర్జన్ చేత ఆ రెండో కంటికి ఆపరేషన్ చేయించాలి.'

మనుష్యుల మనస్తత్వాలు ఎంత స్వల్పకాలంలో మారిపోయాయి!...

నాలుగైదు నెలలు గడిచాక ఓనాడు నేను వెళ్లేసరికి రవణ ఆఫీసుకు వెళ్లిపోయాడు. ఇల్లంతా బిక్కుబిక్కుమంటూ వుంది. బాబు అటూ యిటూ నవ్వుతూ గెంతుతుంటే చీకటి కోణంలో మెరుపు మెరిసినట్టుండేది. సుందరి శుచిగా పూజచేస్తోంది.

'ఏవిటిది?' అనడిగాను ఆశ్చర్యపోతూ.

రవణతల్లి చెప్పుకుపోయింది.

'ఏముంది నాయనా! ఆ దేవుడి కింకా మామీద దయ కలగలేదు. పుట్టిన ఒక్కనలుసూ అలాపోయిందా మరి- ఇంక దానికి సంతానప్రాప్తి లేదని మొన్న ఎవరో జోస్యం చెప్పారు. అప్పట్నుంచి అది బెంగపెట్టుకుంది. వాడితో చెబితే జోస్యమంతా వట్టి బూటకమన్నాడు. చివరకు బతిమాలి దాన్ని సత్యనారాయణ వ్రతం చేసుకోనీయమన్నాను. మొగుడూ, పెళ్లాం కలిసి ఏ అన్నవరమో వెళ్లి ఆ వ్రతం కాస్తా చేస్తే పిల్లలు వెంటనే పుడతారు? కాని మావాడు దైవనామస్మరణ కూడా చేస్తాడూ? అందుకని ప్రతి శుక్రవారం అదొక్కతే ఇలా చేసుకుంటోంది. దేవుడికి కనికరం కలక్కుండా వుంటుందా?'

'అతనెలా వప్పుకున్నాడు?... ఆశ్చర్యంగా వుందే?'

'పాపాయి కావాలని అతనికి మాత్రం వుండదాయేవిటి? అదలావుంచి ఇది దేవుడిశక్తికి పరీక్ష గీటురాయి... చూద్దాం- అన్నాడు. ఒకవేళ పాపాయి పుట్టినా అది దైవప్రసాదమని నమ్మడనుకో.' సుందరి ఈ మాటలన్నీ వింటూ సిగ్గుతో తలవంచేసుకుంది. ఆమె బుగ్గలు ఎర్రగా కందిపోయాయి.

ఆ వ్రతఫలితం ఏమిటో తెలుసుకోవటానికి కొంతకాలం పట్టింది.

ఓనాడు రవణ నన్ను 'ఇరానీ రెస్టారెంట్'లో పట్టుకున్నాడు.

'చిన్న షాపింగు వుందండి. మీరుకూడా రండి' అంటూ తీసికెళ్లి రకరకాల బొమ్మలు,

చీరలు, పువ్వులు కొన్నాడు. నన్నుకూడా ఇంటికి రమ్మన్నాడు.

'ఈ బొమ్మలెవరికి?' అనడిగాను.

'మా చిన్నాన్న కుటుంబం నిన్ననే దిగింది. చిన్నాన్న కొడుక్కి.' అన్నాడు. ఆయన్ని నేనింత వరకూ చూడలేదు కనుక పరిచయం చేసుకుందామనుకుని అతన్ని వెంబడించాను. తీరాజేసి ఇల్లు చేరుకున్నాక అక్కడ కొత్త మొహాలేవీ కనబడలేదు.

'మీ చిన్నాన్న, పాపాయి ఏడీ?' అనడిగాను.

'ఆ పాపాయి మాకెందుకండీ? మా ఇంట్లోనే పాపాయి రాబోతుంటే?.... మరీ బొమ్మలన్నీ ఎందుకనుకున్నారు?' అని చమత్కరించాడు. ఆశ్చర్యంగా సుందరివైపు చూశాను.

సిగ్గుతో తలవంచుకుని అక్కణ్ణుంచి కదలి పోయింది.

'కంగ్రాచ్యులేషన్స్- సత్యనారాయణమూర్తి దయ' అన్నాను.

'అంతా హంబక్' అన్నాడు.

ప్రస్తుతానికి రవణకుటుంబంలో అందరూ నవ్వుతూ కనిపించినా అతని విపరీతసిద్ధాంతాలు ఏదో ఒకనాడు తుఫానును లేవదీస్తాయని నాకు తెలుసు. అందుకని అతనిలో శాశ్వతమైన మార్పు తీసుకురావటమెలాగని ఆలోచించి ఆలోచించి ఏ నిర్ణయానికీ రాలేకపోయాను. రవణ వ్యక్తులతో పోరాటం సాగించటం మానేసి రెడీమేడ్‌గావున్న నమ్మకాలతో పోరాడి గెలుపొందితే బాగుండేది. రాత్రి పదకొండుగంటలవుతుంది.

మామూలుగా తొమ్మిదింటికే వళ్లుతెలియనినిద్ర పట్టేస్తుంది. ఆనాడు ఎంత ప్రయత్నించినా కళ్లు మూతపడలేదు. అంటే, దానికేదో కారణం వుందని తృప్తిపడ్డాను. దీపం ఆర్పేయటానికి మంచం మీదనుంచి లేవటం, ఎవరో తలుపు తట్టటం ఒకేసారి జరిగాయి. తలుపు కిర్రుమంటూ తెరుచుకుంది. రవణ లోపల కొచ్చాడు. పున్నమినాడు దివ్యంగా వెలుగుతున్న చంద్రుడు ఒక్కసారి కాంతి విహీనంగా తయారవుతే ఎలా వుంటుంది? రవణముఖంకూడా అలాగే వుంది. చొక్కాచెమటతో తడిసిపోయింది. పెదవులు వణుకుతున్నాయి.

'మూర్తిగారూ! తక్షణం రావాలి- సుందరికి నెప్పులు ప్రారంభమై అయిదు గంటల పై చిలుకవుతుంది. డాక్టర్‌లాడ్ ప్రసవం సులభంగా జరగదని, ఆపరేషన్ చెయ్యాలని అంటున్నాడు. అదికూడా ప్రమాదంతో కూడినదంటున్నాడు. ఏం చేయను?... చెప్పండి-' అంత మనిషీ నిలువునా కంపిస్తున్నాడు.

'రవణా! ఇందులో నేనుమాత్రం చేయగలిగిందేముంది? డాక్టర్‌ని బతిమాలుకోటం మెరుగు-'

'అబ్బే!... అదంతా పూర్తయింది. ఇంక తనవలన అయ్యేదేమీ లేదని, అంతా దేవుడి

చేతిలోనే వుందని అన్నాడు-'

'అవును... అతనన్నది సరైందే- దైవాన్ని నువ్వు ధిక్కరించలేవు. నీ యిష్టానిష్టాలతో అతనికి సంబంధం లేదు. నన్నడిగితే సుందరిని దక్కించగలిగింది ఒక్క భగవంతుడే!'

రవణ అయిదు నిముషాల వరకూ మాట్లాడలేదు. ఒక్కసారిగా ఆవేశం వచ్చినవాడిలా గోడమీదున్న శ్రీకృష్ణుడి పటానికి నమస్కరించి, చెంపలు వాయించుకుని, "కృష్ణా!... నన్ను క్షమించు, నా అభిప్రాయాలు పునాది లేనివి....నాసుందరిని దక్కించు...' అన్నాడు.

నాక్కలిగిన ఆనందంలో వూపిరి నిలిచిపోతుందనుకున్నాను.

ఇద్దరం టాక్సీలో హాస్పిటల్‌కు వచ్చాం.

డాక్టర్ లాడ్ చిరునవ్వుతో బయటకి వచ్చాడు.

'కంగ్రాచ్యులేషన్స్ మిస్టర్ రవణా!..' మొగపిల్లాడు.

భయపడవలసిన అవసరం లేదు... మూర్తిగారూ!

'మీతో కొంచెంమాట్లాడాలి ఇలా రండి...' అంటూ నన్ను తన గదిలోకి తీసుకుపోయాడు.

'చివరకు దేవుడికి దండం పెట్టాడా లేదా?'

'ఆ... అంతా అనుకున్నట్లే జరిగింది.'

డాక్టర్ లాడ్ కన్నుగీటి పెద్దగా నవ్వాడు.

గదిలోంచి బయటకొచ్చాను. రవణముఖం ప్రశాంతంగా వుంది.

'రవణా! నువ్వు ఏమనుకున్నా సరే! ఈ లోకంలో సుఖంగా బతకాలనివుంటే నలుగురూ అవుననేదాన్ని కాదనకుండా, ఖండించకుండా వుండాలి. దాన్ని మనం నమ్మినా, నమ్మకపోయినా, నమ్మినట్టు నటించటంలో తప్పులేదు. ఈ నటనవలన ఇతరులకు బాధలేదు. వారి మూలాన మనకూ బాధలేదు. సత్యాన్వేషణకు బయలుదేరితే మందలో మానవుడిగా బతకలేం. ఏ వాల్మీకిగానో- సొక్రటీస్‌గానో- గెలీలియోగానో- లూథర్‌గానో బతకవలసి వుంటుంది. మనం బతికేది' స్వల్పకాలం. ఈ మాత్రం దానికి కోరి కొరివితో నెత్తి గోక్కున్నట్లు కష్టాలను తెచ్చుకోడమెందుకు?...

రవణ అంగీకారసూచకంగా తల వూగించాడు. చివరకు నాకో సందేహం కలిగింది- ఇందులో గెలిచిందెవరు? ఓడిపోయిందెవరు? ఏమో!... జయాపజయాలు దైవాధీనాలు-

సరైన సమాధానం మాత్రం రాలేదు.

రాదు కూడా-

జులై 1958 (భారతి)